
అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అనిత, పక్కన మంత్రి కొండపల్లి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఇక డయేరియాతో మరణించకూడదు

సంభవిస్తే వేటు తప్పదు: మంత్రి అనిత

ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్: జిల్లాలో ఇకపై డయేరియాతో ఏ ఒక్కరు మృతి చెంద కూడదు.. మరణాలు నమోదైతే అధికారులపై చర్యలు తప్పవు.. అని రాష్ట్ర హోం శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. ఇప్పటికీ అదుపులోకి తీసుకురాకపోతే తొలి వేటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై పడుతుందన్నారు. దీనికి డీఎంహెచ్‌వో భాస్కరరావు బదులిచ్చే ప్రయత్నం చేయగా.. మనం చెప్పే మాటలు ప్రజలు నమ్మాలన్నారు. ప్రతి శాఖకు ఒక నిర్దిష్ట కార్యాచరణ ఉంటుందని, దాని ప్రకారం ఆయా శాఖలు పనిచేయాలని స్పష్టం చేశారు. ఇన్‌ఛార్జి మంత్రిగా గురువారం తొలిసారి జిల్లాకు వచ్చిన అనిత కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

‘గుర్లలో మరణాలు తనకు ఎంతో బాధ కలిగించాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వచ్చే పది రోజుల్లో తాగునీటి ట్యాంకుల శుభ్రతతో పాటు క్లోరినేషన్ చేయాలి. డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లాలి. జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. జిల్లాలో బహిరంగ మల విసర్జన లేకుండా చూడాలి.

అప్రమత్తంగా ఉండండి

జిల్లాలో ప్రభుత్వ పాలన సజావుగా సాగాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేసి జిల్లా ప్రగతికి కృషి చేయాలి. ప్రజల వినతులపై సానుకూలంగా స్పందించాలి. ప్రతి అర్జీకి రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి. తుపానును దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని నదులు, జలాశయాల గట్లు పటిష్ఠంగా ఉండేలా చూడాలి.

తాగునీరు కలుషితమైనట్లు నిర్ధారణ

గుర్లలో డయేరియా ప్రబలిన తర్వాత గ్రామంలోని తాగునీటి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించామని, తాగునీరు కలుషితమైనట్లు నిర్ధారణ జరిగిందని మంత్రి అనిత పేర్కొన్నారు. అయిదేళ్లలో జిల్లాకు రూ.1300 కోట్ల జల్‌జీవన్ మిషన్ పనులు మంజూరైతే, అందులో రూ.260 కోట్ల విలువైన పనులు జరిగాయని మంత్రి శ్రీనివాస్ అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.185 కోట్లు బిల్లులు చెల్లించారని, మిగిలినవి తమ ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు.

నిధుల కొరత లేదు

వాతావరణంలో మార్పులను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయన్నారు. నిధుల కొరత లేనందున పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, దాని వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పారు. మూడు రోజులుగా జిల్లా అంతటా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. ప్రతి బుధవారం నీటి నమూనాలు తీసి పరీక్షిస్తున్నామన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 29 శాఖలకు చెందిన 66 పథకాలను దిశ పేరుతో సమీక్షిస్తామన్నారు. పీఎం విశ్వకర్మ, సూర్యఘర్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను కోరారు. భోగాపురం విమానాశ్రయం వల్ల ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు రూ.960 కోట్లతో జాతీయ రహదారి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ అధికారులు సమష్టిగా పనిచేయాలని, పనుల్లో పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ 30 వేల ఎకరాలకు నీరందించే తారకరామ తీర్థసాగర్‌కు 30 ఏళ్ల క్రితమే శంకుస్థాపన జరిగినా ఇప్పటికీ పూర్తి కాలేదని ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇంటింటికీ కుళాయి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ప్రజా మరుగుదొడ్ల మరమ్మతులు చేయిస్తే జల కాలుష్యం నివారించవచ్చని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సూచించారు. ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, కోళ్ల లలితకుమారి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సేధు మాధవన్ పాల్గొన్నారు.

ఓదార్చి.. ధైర్యం చెప్పి..

గరివిడి, గుర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర హోం శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం గుర్లలో డయేరియా బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో బాధిత కుటుంబాల సభ్యులను కలిసి ఓదార్చారు. కొంతమంది బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అనంతరం గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డయేరియాకు దారితీసిన కారణాల గురించి ఆరా తీసి తెలుసుకున్నారు. బాధితులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, లోకం మాధవి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, విజయనగరం పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు ఉన్నారు.


గ్రామంలో పర్యటిస్తున్న అనిత, మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యేలు


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ గోపీనాథ్

మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

బొబ్బిలి, న్యూస్‌టుడే: మహిళా భద్రతపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించినట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి వెల్లడించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహిళల భద్రతపై నిఘా ఉంచామన్నారు. ఎలాంటి తప్పుడు సందేశాలు మహిళల చరవాణులకు వచ్చినా పోలీసులను ఆశ్రయించవచ్చని, టోల్ ఫ్రీ 112 నంబరుకు కూడా సంప్రదించాలని కోరారు. గంజాయి మత్తులో పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని, రవాణా, విక్రయాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ మోసాలు ఇటీవల పెరిగాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చరవాణులకు వస్తున్న సందేశాలు, యాప్‌లను క్లిక్ చేస్తే నష్టపోవాల్సి వస్తుందని, డబ్బులు పోయిన సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే బ్యాంకుల ద్వారా సొమ్ము ఇప్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. సీబీఐ, సైబర్ క్రైం పోలీసుల పేరుతో ఫోన్లు చాలామందికి వస్తున్నాయని, దీనిపై కూడా నిఘా పెంచామని చెప్పారు. దీనికి ముందు డీఐజీ ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి జరుగుతున్న పరిణామాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఏ తరహా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందో అవగాహన కల్పించారు.

★ విజయనగరం మండలానికి చెందిన ఓ వ్యక్తి వైద్యారోగ్య శాఖ పింఛనుకు ఎంపికయ్యారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఆరు దశల పరిశీలనలో భాగంగా భూమి ఎక్కువగా ఉందని చూపి.. తొలగించారు. వాస్తవానికి ఆయనకు సెంటు స్థలం కూడా లేదు. దీంతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. ఇప్పటికీ రికార్డులు మారకపోవడంతో అనర్హుడయ్యారు.

★ కొత్తవలస మండలం తుమ్మికాపల్లికి చెందిన వృద్ధుడు నాలుగు సార్లు దరఖాస్తు చేశారు. అయితే రోజువారీ కూలీ అయిన అతని పేరిట విజయనగరంలోని ఓ అపార్టుమెంటులో అయిదిళ్లకు విద్యుత్తు మీటర్లు ఉన్నాయని సచివాలయ సిబ్బంది.. తిరస్కరించారు. దీంతో నేటికీ ఎదురు చూస్తున్నారు.

★ నగరంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మహిళ వితంతువు. అయితే ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నట్లు నవశకం సర్వేలో తేలింది. సచివాలయానికి వెళ్లగా.. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అప్పట్లో పలుమార్లు స్పందనను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది.

పింఛను.. ఇక మరింత సులువు

- ఆరు దశల పరిశీలనకు స్వస్తి
- గ్రామసభలోనే తుది నిర్ణయం


– న్యూస్‌టుడే, విజయనగరం
మయూరికూడలి

ఉమ్మడి జిల్లాలో చాలామంది వివిధ సమస్యలతో పింఛనుకు దూరమయ్యారు. . నవశకం పేరిట గత ప్రభుత్వం ఆరు దశల పరిశీలన చేపట్టి.. అర్హులను వడపోసింది.. ఈక్రమంలో నిజమైన లబ్ధిదారులు సైతం అనర్హులయ్యారు.. సరైన ధ్రువపత్రాల కోసం అయిదేళ్లు కార్యాలయాల చుట్టూ తిరిగారు.. ఈ కష్టాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. నాటి విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. గ్రామసభకే ఎంపిక ప్రక్రియను అప్పగించింది.

గత సర్వే ఇలా..

గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు ఆరు దశల పరిశీలన ఉండేది. భూమి (మెట్ట పదెకరాలు, పల్లం మూడెకరాలు) ఎక్కువగా ఉన్నా, ఆదాయ పన్ను, జీఎస్టీ చెల్లిస్తున్న వారు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారు, ప్రభుత్వ పింఛనుదారులు, 300 యూనిట్లకు పైబడి విద్యుత్తు బిల్లు, పట్టణంలో 1000 చ.అ., గ్రామీణంలో 750 చ.అ.. ఇల్లు, నాలుగు చక్రాల వాహనం ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించేవారు. ఈక్రమంలో చాలామంది వివరాలు తప్పుగా నమోదు కావడంతో ఇబ్బందులు పడేవారు. ఇలాంటి వారు ఉమ్మడి జిల్లాలో 4,000 మంది వరకు ఉన్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. వారు క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రంలో సచివాలయాలను సంప్రదిస్తే.. తదుపరి ప్రక్రియ సాగేది. అయితే కార్యాలయాల చుట్టూ తిరగలేక.. చాలామంది దూరం అయ్యారు.

50 రోజుల ప్రణాళిక

తాజాగా కూటమి నిర్ణయంతో పాత వారితో పాటు కొత్తగా అర్హులైన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించింది. నవంబరు నుంచి అధికారికంగా తీసుకోనున్నారు. డిసెంబరులోపు పూర్తి చేసి, జనవరి నుంచి నగదు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. గ్రామసభలో నిర్ణయం తర్వాత తుది జాబితాలను ప్రకటిస్తామని, స్థానికంగానే ఎంపికలు ఉంటాయని డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు.

నిధులు మింగేసి.. వ్యాధులు పోగేసి

- అయిదేళ్లూ ఇదే పరిస్థితి
- నేటికీ వెంటాడుతున్న సమస్యలు

గత ప్రభుత్వ పాపాలు పల్లె ప్రజలను నేటికీ వెంటాడుతున్నాయి.. సమస్యల రూపంలో శాపంలా చుట్టుముడుతున్నాయి.. అయిదేళ్లూ కనీస అభివృద్ధి పనులు చేపట్టలేదు.. ఆర్థిక నిధులను సైతం లాగేశారు.. ఈ క్రమంలో పారిశుద్ధ్య చర్యలు నిలిచిపోయాయి.. కాలువల్లో మురుగు పేరుకుపోయింది.. ఎక్కడికక్కడే వాడుక నీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి.. ఫలితంగా నెల రోజుల వ్యవధిలోనే ఎస్.కోట, కొత్తవలస, పాచిపెంట, గుర్ల, దత్తిరాజేరు తదితర ప్రాంతాల్లో అతిసారం విజృంభించింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు రావడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.


బొబ్బిలి గ్రామీణం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో మండలంలో తాగునీటి పథకాలను శుభ్రం చేస్తున్నారు. బుధవారం చింతాడ ట్యాంకు లోపల క్లోరినేషన్ చేశారు.



– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

విజయనగం జిల్లాలో 777, మన్యంలో 451 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో అంతర్గత రహదారులు, కాలువలు తదితర పనులకు ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం పెద్దఎత్తున సొమ్మును దారి మళ్లించడంతో ప్రత్యామ్నాయం కరవైంది. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నిధుల నుంచే రూ.29.27 కోట్లను విద్యుత్తు బకాయిలకు మినహాయించారు. ఎన్నికల ముందు 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇచ్చిన రెండో విడత నిధులను సైతం విడుదల చేయలేదు.

తాగునీటి పరీక్షలేవీ..

ప్రజలకు అందించే తాగునీటికి పరీక్షలు, క్లోరినేషన్ వంటి చర్యలు లోపించాయి. రెండు జిల్లాల్లో పది ప్రయోగశాలలుండగా.. వాటి పరిధిలోని మండలాల్లో ఏడాదికోసారి కెమికల్, రెండు సార్లు బ్యాక్టీరియా పరీక్షలు నిర్వహించాలి. ఇవి కాకుండా అత్యవసర సమయాల్లో ప్రత్యేకంగా చేపట్టాలి. పంచాయతీల వద్దనున్న ఫీల్డ్‌టెస్ట్ కిట్లతో ఎప్పటికప్పుడు పరిశీలించాలి. రసాయనాలు లేకపోవడం, సిబ్బందికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో అన్నీ నిలిచిపోయాయి.

ఆగిన పనులు

విజయనగరం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా 4,10,065 కుటుంబాలకు 1,94,998 కనెక్షన్లు కేటాయించారు. ఇంకా 2,15,067 ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలి. కేంద్రం నిధులిచ్చినా వైకాపా పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడం, రాష్ట్ర వాటాగా తన వంతు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. కూటమి వచ్చాక.. పల్స్ సర్వే ఆధారంగా అవకాశాన్ని బట్టి జిల్లాలో బోర్లు, రిజర్వాయర్ల ద్వారా కుళాయి వేసేందుకు రూ.36.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.


వేపాడ : మండలంలోని సింగరాయి గ్రామంలో మురుగు కాలువల్లో పూడికలు తీయిస్తున్న సచివాలయ సిబ్బంది

రూ.కోట్లలో బకాయిలు

రెండు జిల్లాల్లోని 33 సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా సుమారు పది లక్షల మందికి నీరందుతోంది. వీటి నిర్వహణకు ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. సగటున ఏటా రూ.40 కోట్లు ఖర్చవుతుంది. జడ్పీ ద్వారా రూ.16 కోట్లే ఇస్తుండడంతో.. గుత్తేదారులకు పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.168.83 కోట్ల వ్యయం కాగా.. జడ్పీకి 15వ ఆర్థిక సంఘం కింద 2020-21 నుంచి 2023-24 నాటికి రూ.52.20 కోట్లు వచ్చాయి. మిగిలిన రూ.116.63 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. కానీ ఇవ్వలేదు. కూటమి వచ్చాక రూ.8.11 కోట్లు అందించింది.

జీతం అడిగితే.. తొలగింపు

క్లాప్‌మిత్రలకు నెలకు రూ.6 వేలు చెల్లించేవారు. 3,500 మంది ఉండగా.. ఇప్పటికీ కొన్ని పంచాయతీల్లో ఏడాదిపైగా బకాయిలున్నాయి. 2022 మార్చి వరకు స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా జీతం అందించేవారు. కేంద్రం నిలిపివేయడంతో అప్పటి నుంచి వారికి కష్టాలు మొదలయ్యాయి. జీతం అడిగితే విధుల నుంచి తొలగించేవారు. ప్రస్తుతం తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని విజయనగరం డీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో రూ.100 కోట్ల మేర నిధులున్నాయని చెప్పారు.

అన్నీ నిరుపయోగం

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన సంపద సృష్టి కేంద్రాలు మూలకు చేరాయి. 855 ఉండగా.. 70 వరకు పనిచేయలేదు. మిగిలిన వాటిల్లో అరకొరగానే ఎరువు తయారీ అవుతోంది. రెండు జిల్లాల్లో మరో 373 కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఉపాధి పథకం కింద నిధులివ్వాల్సి ఉన్నా.. వైకాపా పట్టించుకోలేదు.

విజయనగరం జిల్లాలో పరిస్థితి..	
పంచాయతీలు	777
రెవెన్యూ గ్రామాలు	926
సీపీడబ్ల్యూఎస్	33
పీడీడబ్ల్యూఎస్	934
ఎంపీడబ్ల్యూఎస్	185
డైరెక్ట్ పంపింగ్	408
బోరు బావులు	15468

అరుపులు.. తోపులాటలు

గందరగోళం మధ్య డయేరియా బాధితులను పరామర్శించిన జగన్

ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే-గరివిడి, గుర్ల, చీపురుపల్లి: డయేరియాతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేందుకు వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గుర్ల వచ్చారు. బాధితులు తమ బాధలు చెప్పుకొందామని ఆశించారు. వైకాపా శ్రేణులు మాత్రం అత్యుత్సాహాన్ని ప్రదర్శించాయి. జగన్ గుర్లలో అడుగుపెట్టిన దగ్గర నుంచి ఆయన తిరిగి వెళ్లే వరకు ఆద్యంతం అరుపులకు తోడు తోపులాటలు చోటుచేసుకోవడంతో పరామర్శ రసాభాసగా మారింది. బాధితులతో జగన్ ఏం మాట్లాడుతున్నారో, వారేం చెబుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తోపులాటల కారణంగా టెంట్లు కూలిపోయాయి. జడ్పీ ఛైర్మన్, వైకాపా జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్


డీఈవోగా మాణిక్యం నాయుడు



విజయనగరం విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్‌కు బదిలీ అయింది. విశాఖ డీఈవోగా వెళ్లనున్నారు. ఆయన స్థానంలో విశాఖలో విద్యాశిక్షణ సంస్థ (డైట్) సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న యు.మాణిక్యంనాయుడు నియమితులయ్యారు.

వంటింట దీపావళి ధమాకా

ఇక ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు




పంపిణీ ఇలా

సమయం	సిలిండర్లు
ఏప్రిల్- జులై	01
ఆగస్టు- నవంబరు	01
డిసెంబరు- మార్చి	01

న్యూస్‌టుడే-రాజాం

కూటమి ప్రభుత్వం దీపావళి ధమాకా ప్రకటించింది. సూపర్-6లో మరో కీలక పథకానికి పచ్చజెండా ఊపింది. మహిళలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లకు మంత్రి మండలి బుధవారం ఆమోద ముద్ర వేసింది. దీపావళి రోజున చంద్రబాబు పథకాన్ని ప్రారంభిస్తారు. ఆ రోజు నుంచే సిలిండర్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి దీన్ని వర్తింపజేస్తామని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ పథకం ద్వారా ఎంత మందికి లబ్ధి కలుగుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేకపోయినా.. తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికి వర్తించే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. రెండు చోట్లా 8,62,939 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ లెక్కన ఏడాదికి 25,88,817 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం బండ ధర రూ.827.51 (దూరం బట్టి మారుతుంది)గా ఉంది. కేంద్ర ప్రభుత్వం రూ.10.62 రాయితీ ఇస్తోంది. అంతిమంగా జనం రూ.816.89 వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం రూ.211.47 కోట్ల మేర భారం మోయాల్సి ఉంటుంది.



బ్యాంకు వ్యక్తిగత ఖాతాకు నగదు జమ

లబ్ధిదారులు ఇప్పటి మాదిరిగానే గ్యాస్ సిలిండర్లను నగదు చెల్లించి బుకింగ్ చేసుకోవాలి. సిలిండర్ ఇంటికి డెలివరీ అయిన 48 గంటల్లో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో వ్యక్తిగత ఖాతాకు నగదు జమ చేస్తారు. ప్రతి నాలుగు నెలల్లో ఒక సిలిండర్‌ను ఎప్పుడు అయినా ఉచితంగా పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. బుకింగ్, డెలివరీ, నగదు జమల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే గ్రామస్థాయిలో సచివాలయాల్లోనే పరిష్కరిస్తారు. ఇందుకు ప్రతి సచివాలయం నుంచి ఒక ఉద్యోగికి బాధ్యతలు అప్పగించనున్నారు.

పారదర్శకంగా అమలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తాం. విధి విధానాలు ఇంకా వెల్లడి కాలేదు. దీపావళి నుంచి అర్హులైన వారందరికీ పథకాన్ని వర్తింపజేస్తాం.

– మధుసూదనరావు, డీఎస్‌వో

ఓటుహక్కుపై అవగాహన


మాట్లాడుతున్న మోహనరావు, చిత్రంలో డీఆర్వోలు

విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఓటుహక్కుపై ఉపాధ్యాయులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మోహనరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అర్హులైన వారంతా ఓటుహక్కు పొందేందుకు నవంబరు ఆరో తేదీలోగా దరఖాస్తు చేయించాలని సూచించారు. 23న ముసాయిదా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబరు 30న తుది జాబితాను వెల్లడిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల డీఆర్వోలు ఎస్.డి.అనిత, జి.కేశవనాయుడు, జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు భాస్కరరావు, తహసీల్దార్లు, ఎంఈవోలు, కళాశాలల ప్రధానాచార్యులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి అఖిల భారత పశుగణన

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారి వై.వి.రమణ తెలిపారు. నిర్వహణ కోసం 68 మంది పర్యవేక్షకులను నియమించామన్నారు. ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. వీరంతా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, వివరాలు సేకరిస్తారని, పాడిరైతులు సహకరించాలని కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ప్రక్రియ సాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పశువుల సంఖ్య తెలుస్తుందని, తద్వారా పథకాల అమలు సులువవుతుందని చెప్పారు.

వరి దక్కేనా.. జొన్న కదిలేనా


మరడాం గ్రామంలో నీరు లేక ఎండిన వరి పైరు

గడిచిన 15 రోజులుగా వర్షాలు లేకపోవడం, ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట, పిగులుపొట్ట, గింజకట్టే దశల్లో ఉన్నందున నీరు అందక దిగుబడులు తగ్గే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, సాలూరు, మెంటాడ, దత్తిరాజేరు, సంతకవిటి, వంగర తదితర మండలాల పరిధిలో 30 వేల హెక్టార్లలో సాగవుతోంది. అందులో మెట్ట భూముల్లో ఉన్న 8 వేల హెక్టార్ల మేర ప్రస్తుతం నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. మరడాం, పాచలవలస, కొత్తవలస, చినకాద, కుంటినవలస, పెదమేడపల్లి, మీసాలపేట, బంగారమ్మపేట, భూదేవిపేట, మరుపల్లి, జిన్నాం, దేవుపల్లి, కెరటాం, అగ్రహారం, బుడతనాపల్లి తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గజపతినగరంలో అక్టోబరు నెలలో సాధారణ వర్షపాతం 158.7 మి.మీ కాగా ఇప్పటి వరకు 57.4 మి.మీ నమోదైంది. దీంతో కొందరు అన్నదాతలు ఆయిల్ ఇంజిన్లు పెట్టి నీటిని తోడుతున్నారు. దీనిపై ఏడీఏ మహరాజన్ వద్ద ప్రస్తావించగా ఈ సమయంలో వర్షాలు కురిస్తే కంకులు పెరుగుతాయని చెప్పారు. అవసరం మేరకు 5 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసి పంటను కాపాడుకోవాలని సూచించారు.

– న్యూస్‌టుడే, గజపతినగరం


బంగారమ్మపేటలో ఆయిల్ ఇంజినుతో నీరు తోడుతున్న రైతు

వాయుగుండం ప్రభావంతో మొక్కజొన్న రైతులు ఆందోళనలు వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట వర్షాలతో తడిచి నష్టపోతుందేమోనని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.



పాచిపెంట మండలంలో 6 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. దాదాపు 4 వేల ఎకరాల్లో పంట చేతికొచ్చింది. పొలాల్లో గింజ ఆరబెడుతున్న సమయంలో కురుస్తున్న వర్షాలతో పంట దెబ్బతినే ప్రమాదముందని వాపోతున్నారు. దీనికితోడు సీజన్ ప్రారంభంలో వ్యాపారులు క్వింటా రూ.2,400కు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం భారీగా ధర తగ్గించారని, ప్రభుత్వం సైతం కొనుగోలు కేంద్రాలు పెట్టలేదని పలువురు చెబుతున్నారు. ఈక్రమంలో బస్తాలలో నిల్వ చేస్తున్నామని పేర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట


పాచిపెంటలో రోడ్డుపైనే గింజల ఆరబోత

డీఆర్వోలుగా శ్రీనివాసమూర్తి, రవీంద్రరావు

విజయనగరం అర్బన్, పార్వతీపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాకు కొత్త డీఆర్వోలు వస్తున్నారు. విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్.డి.అనిత బదిలీ అయ్యి.. సాధారణ పరిపాలన శాఖకు వెళ్లనున్నారు. కొన్ని నెలలుగా వ్యక్తిగత సెలవులో ఉన్న ఉప కలెక్టర్ ఎస్.శ్రీనివాసమూర్తిని ఆమెస్థానంలో నియమించారు. మన్యం జిల్లాకు ఎ.రవీంద్రరావు రానున్నారు. ఇప్పటివరకు ఆ స్థానంలో కేశవనాయుడు ఇన్‌ఛార్జిగా ఉండేవారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: పారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని, ఈ నెల 29వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచార్యులు కె.పద్మలీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తులు అందజేయవచ్చని, ఇతర వివరాల కోసం vizianagaram.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

తొలిదశలో రూ.13 కోట్లతో ప్రణాళికలు

వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ద్వారా యువతకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. ఈమేరకు రూ.కోట్ల మేర వెచ్చించి.. ఉపాధి అవకాశాలు కల్పించనుంది. అందులో భాగంగా.. బీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. నిరుద్యోగులు.. యూనిట్ల మంజూరు.. ఒక్కొక్క మందికి ఆధారం.. ఖర్చులు.. తదితర వివరాలు సేకరిస్తున్నారు. ప్రక్రియ పూర్తయితే మరికొన్ని నెలల్లోనే మెరుగైన అవకాశాలు దక్కనున్నాయి.

బీసీ యువతకు 'ఉపాధి' పండుగ

విజయనగరం మయూరికూడలి, న్యూస్‌టుడే

మళ్లీ ఆ వెలుగులు..

ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా కేంద్రం నేరుగా రాష్ట్రంలోని బీసీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు ఇస్తోంది. ఇందులో భాగంగా గతంలో మాదిరిగా వివిధ రకాల యూనిట్లు మంజూరు చేయనున్నారు. ఈసారి వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలుగా విభజించి, లబ్ధి చేకూర్చనున్నారు. ఇందులో భాగంగా రెండు జిల్లాలకు సంబంధించి తొలి దశలో రూ.13 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. పనిముట్లు, ట్రాక్టర్లు, కార్లు, బట్టల మిషన్లు, బ్యూటీషియన్ కిట్లు, మామిడితాండ్ర, బుట్టల అల్లికలు తదితర యూనిట్లు మంజూరుకు అవకాశం ఉందని కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈమేరకు ప్రభుత్వానికి వివరాలు పంపిస్తున్నామని, అధికారిక ఉత్తర్వులు వచ్చాక కార్యాచరణ సిద్ధం చేస్తామని చెప్పారు.



భారీగా లబ్ధి..

తెదేపా అధికారంలో తూర్పు కాపు, కుమ్మరి, రజక, నాయీ బ్రాహ్మణ, వాల్మీకి, బోయ తదితర కులాలతో పాటు ఈబీసీ, ఎంబీసీ(సంచార జాతులు), వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. వివిధ రకాల కులవృత్తుల అవసరం మేర 30 శాతం రాయితీతో రుణాలు అందించేది. స్వయం ఉపాధిలో భాగంగా 30 శాతం, ఆదరణ పథకం కింద కొన్ని యూనిట్లకు 90 శాతం వరకు రాయితీ దక్కేది. అంతే కాకుండా ఎన్‌బీసీఎఫ్‌డీసీ(జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్) ద్వారా 40 శాతం సబ్సిడీతో వాహనాలు అందించారు. 2014 నుంచి 2019 మార్చి వరకు ఉమ్మడి జిల్లాలో 50,852 మందికి రూ.220.98 కోట్ల రుణం దక్కింది.

అయిదేళ్లు నిర్వీర్యం..

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా పెద్దఎత్తున రుణాలు అందించారు. అర్హులకు పలు రకాల వాహనాలు సమకూర్చారు. వైకాపా వచ్చాక ఆయా పథకాలను ఆపేసింది. కార్పొరేషన్లను శాఖలుగా విభజించింది. నిర్వీర్యం చేసింది. అయిదేళ్లలో స్వయం ఉపాధి కోసం రూపాయి కూడా చెల్లించలేదు. ఒక్కరికి కూడా రుణం దక్కలేదు. శిక్షణలు, వాహనాలు సైతం దూరమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇకనుంచి భారీ ఎత్తున లబ్ధి చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

హోం మంత్రికి ఘన స్వాగతం


మంత్రితో కొండపల్లి, అదితి, నాగమాధవి, నాగార్జున, లలితకుమారి, ఐవీపీ, రవిశేఖర్, వనజాక్షి, అనురాధా బేగం తదితరులు


అశోక్‌కు నమస్కరిస్తూ..

విజయనగరం అర్బన్, డెంకాడ, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర హోంశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆమె పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజును బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. పాదాభివందనం చేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం అశోక్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, కోళ్ల లలితకుమారి, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడి నుంచి గుర్లకు వెళ్లారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిమిడి నాగార్జున, ఐవీపీ.రాజు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, రాష్ట్రపరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పార్లమెంటరీ మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సువ్వాడ వనజాక్షి, అనురాధా బేగం పాల్గొన్నారు. రాజాపులోవ వద్ద మంత్రిని రవిశేఖర్, బంగార్రాజు, ఆనంద్‌కుమార్ గజమాలతో సత్కరించారు.

ఎంఈవోల సంఘం అధ్యక్షుడిగా రామారావు


నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారుల(ఎంఈవో-1) సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా పి.రామారావు(గరివిడి) ఎన్నికయ్యారు. సంఘం నూతన కమిటీ ఎన్నిక గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ఎస్.విమలమ్మ, గౌరవాధ్యక్షుడిగా ఎం.రమణమూర్తి, సలహాదారుడిగా యూఎస్ఎన్.మూర్తి, కోశాధికారిగా త్రినాథరావు, ఉపాధ్యక్షులుగా ఆర్.ప్రసాద్‌రావు, ఎస్.భానుప్రకాష్, పి.ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులుగా ఆర్.శ్రీదేవి, జె.జయశ్రీ, సంయుక్త కార్యదర్శులుగా పి.లక్ష్మణదొర, ఎం.వెంకటరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు సింహాచలం, నర్సింగరావు, తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


'చంద్రబాబు ఆస్థానం' పుస్తకావిష్కరణ



విజయనగరం అర్బన్: సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రుల రాజకీయ జీవిత విశేషాలపై ప్రముఖ రచయిత సముద్రాల గురుప్రసాద్ రాసిన 'చంద్రబాబు ఆస్థానం' పుస్తకాన్ని అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి ఆవిష్కరించారు. నాయకులు శివారెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుడి మృతి

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: శివరాంపురం గ్రామానికి చెందిన రంగస్థల పౌరాణిక కళాకారుడు ఆర్.శ్రీరాములు నాయుడు(92) బుధవారం రాత్రి మృతి చెందారు. శ్రీకృష్ణుడు, రాముడు పాత్రల్లో రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు అందించారు. సుమారు 200 మంది వృద్ధ కళాకారులకు పింఛన్లు, నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు ఇప్పించారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురజాడ విద్యా సంస్థల అధినేత జి.స్వామినాయుడు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.


శ్రీరాములు నాయుడు (పాతచిత్రం)

ప్రియుడిపై యాసిడ్ దాడి

బూర్జ, న్యూస్‌టుడే: ప్రియుడిపై ఓ యువతి యాసిడ్ పోసిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో జరిగింది. బూర్జ ఎస్సై ప్రవల్లిక వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన కె.ప్రసాద్ డెంకాడలో లారీ చోదకుడిగా పనిచేస్తున్నాడు. తొమ్మిది నెలల కిందట ఓవీపేటకు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా ఆమదాలవలసలో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో మనస్పర్థలు రావడంతో ఇటీవల ఆమె తన స్వగ్రామం వెళ్లిపోగా అతను డెంకాడ వెళ్లిపోయాడు. ఈనెల 23న ప్రసాద్ ఆమె ఇంటికి వెళ్లాడు. మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆమె యాసిడ్ పోసింది. గాయపడిన యువకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెల్లకోటు పవిత్రతను కాపాడుతాం



వైద్య వృత్తి ఎంతో గొప్పదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచార్యురాలు కె.పద్మలీల పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరిన ఎంబీబీఎస్ విద్యార్థులతో ఆసుపత్రి యాజమాన్యం గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా ఈ రంగం గొప్పదనాన్ని ఆమె వివరించారు. కార్యక్రమంలో భాగంగా వారితో ప్రతిజ్ఞ చేశారు. తెల్లకోటు పవిత్రతను కాపాడుతామని అంతా నినదించారు. డీఎంఈ వ్యవస్థాపకుడు కె.విష్ణు ప్రసాద్, శ్రీకాకుళం కళాశాల ప్రధానాచార్యుడు ఆర్.వెంకటాచలం, మహారాజ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు అప్పలనాయుడు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వైద్యవిభాగం

విద్యుదాఘాతంతో ఇంటిపెద్ద దుర్మరణం


శంకరరావు (పాతచిత్రం)

మక్కువ: స్తంభం పైకెక్కిన ఓ వ్యక్తి విద్యుదాఘాతం కారణంగా కిందపడి మరణించాడు. ఈ విషాదకర ఘటన మక్కువ మండలంలో చోటుచేసుకుంది. చెముడు గ్రామానికి చెందిన కె.శంకరరావు(49) ప్రైవేటుగా విద్యుత్తు పనులు చేస్తుంటాడు. గురువారం స్థానికంగా ఉన్న ఓ స్తంభం ఎక్కాడు. ఇన్వెర్టర్ లైన్ నుంచి విద్యుత్తు సరఫరా కావడంతో కిందపడ్డాడు. అక్కడివారు స్పందించి, ఆసుపత్రికి తరలించేలోపే మరణించాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. శంకరరావుకు భార్య పార్వతి, ఇద్దరు పిల్లలున్నారు.

ప్రాణం తీసిన పాముకాటు

గజపతినగరం: మండలంలోని వేమలికి చెందిన పి.బంగారమ్మ(48) ఈనెల 22న గొర్రెలను మేపేందుకు వెళ్లి పొలంలో పాము కాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధికి వెళ్తే ఊపిరి ఆగింది


గురునాయుడు (పాతచిత్రం)

గుర్ల, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని గ్రామీణ మండలం చేపూరులోని జాతీయ రహదారి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా వాసి దుర్మరణం చెందాడు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. గుర్ల గ్రామానికి చెందిన కె.గురునాయుడు(35) లారీ చోదకుడిగా పనిచేసేవాడు. కోడిగుడ్ల లోడు కోసం ఇటీవల హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో చేపూరు కూడలి వద్ద మలుపు తిరుగుతున్న లారీని ఢీ కొనడంతో క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. సమాచారం అందుకున్న ఎన్‌హెచ్ అంబులెన్సు సిబ్బంది కొనఊపిరితో ఉన్న ఆయనను బయటకు తీసి, ఆసుపత్రికి తరలించారు. అయితే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన వెంట ఉన్న క్లీనరు రాముకు గాయాలయ్యాయి. గురునాయుడుకు భార్య ఆదిలక్ష్మి, కుమారులు గిరి, చరణ్ ఉన్నారు. కుటుంబ పోషణకు ఆయనే దిక్కు. దీంతో కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని గ్రామీణ ఎస్సై కృష్ణమాచారి తెలిపారు.


వ్యానులో ఇరుక్కుపోవడంతో బయటకు తీస్తున్న ఎన్‌హెచ్ సిబ్బంది

యువకుడిపై పోక్సో కేసు

బొబ్బిలి, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలోని ఓ ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ చదువుతున్న బాలిక.. అదే ప్రాంతానికి చెందిన యువకుడు మోహనరావు తనను లైంగికంగా లోబర్చుకున్నట్లు ఫిర్యాదు చేయడంతో గురువారం అతడిపై పోక్సో కేసు నమోదు చేశామని బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. పార్వతీపురం పోలీసులు కేసును బొబ్బిలికి బదిలీ చేయడంతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని చెప్పారు. బ్రిక్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న నిందితుడు బాలికను బొబ్బిలికి తీసుకువచ్చి లోబర్చుకున్నట్లు సమాచారం ఉందన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నగరంలో మూడు బస్సుల దగ్ధం


కాలిపోయిన వాహనాలు

నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని పాత బస్టాండు సమీపంలోని రాజీవ్ స్టేడియం ఎదురుగా పార్కింగ్‌లో ఉన్న మూడు ప్రైవేటు బస్సులు గురువారం వేకువ జామున దగ్ధమయ్యాయి. విజయలక్ష్మి ట్రావెల్స్ పేరుతో కొన్నిరోజులుగా వీటిని నడుపుతున్నారు. బుధవారం రాత్రి మైదానం ముందుగల రోడ్డుపై పెట్టారు. సమీపంలోనే బార్ అండ్ రెస్టారెంటు ఉంది. వేకువ జామున రెండు వాహనాల నుంచి పొగలు రావడాన్ని చూసి సెక్యూరిటీ గార్డు యజమాని తాతారావుకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపు రోడ్డుకు అటువైపున్న మరొకటి కూడా దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని అగ్నిమాపకాధికారి రామ్‌ప్రకాశ్ తెలిపారు. కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

హోరాహోరీగా అంతర కళాశాలల పోటీలు


పాలకొండలో క్రీడాకారిణుల కబడ్డీ పోటీలు

పాలకొండ, గ్రామీణం, క్రీడావిభాగం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్ కళాశాలల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో రాజాం జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, మహిళల విభాగంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జట్లు విజేతలుగా నిలిచాయి. కబడ్డీలో మహిళల విభాగంలో సీతంపేట, పాలకొండ విద్యార్థులు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ డా.ఎం.శ్యామ్‌బాబు పర్యవేక్షించారు. ★ స్కూల్‌గేమ్స్ అండర్-14 బాల, బాలికల ఎంపికలు విజయనగరంలోని రాజీవ్ మైదానంలో జరిగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 200 మంది వరకు క్రీడాకారులు తరలివచ్చారు.


విజయనగరంలో వాలీబాల్‌లో తలపడుతున్న బాలికలు

సర్వాంగ సుందరంగా వెంకన్న ఆలయం



బొబ్బిలి మండలంలోని గొర్లెసీతారాంపురంలో వెంకటేశ్వర ఆలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొంది. బొబ్బిలి-విశాఖ రహదారిని ఆనుకుని దీన్ని హోమియో వైద్యుడు జి.ప్రసాదరావు నిర్మించారు. బొబ్బిలి ప్రాంత భక్తులంతా ప్రతి శనివారం ఇక్కడికి వచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళ రంగులతో శోభాయమానంగా కనిపించింది. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

ఖోఖో పోటీలకు తోండ్రంగి విద్యార్థులు

గరివిడి, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకంలో 26 నుంచి 28 వరకు జరగనున్న 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గరివిడి మండలం తోండ్రంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సీహెచ్. భవాని, పి.దేవి, సీహెచ్. లావణ్య, బి.దివ్యశ్రీ, ఆర్. జాహ్నవి, బాలుర విభాగంలో పి.నవాజ్, వి.హరిప్రసాద్, కె.యోగేంద్ర సాయి బాలాజీ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. హెచ్ఎం కె.రమేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రతిభకు పదును





బొబ్బిలి పట్టణంలోని అభ్యుదయ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎం. స్నేహ (10వ తరగతి), జి.మౌనిక (9వ తరగతి), కోట్ల లక్ష్యం (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపల్ డాక్టర్ చింత శారద, ఉపాధ్యాయులు వసుంధర, బేగం, లతల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు పి.వి.ఎల్.ఎన్ సాయిబాబా పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. – న్యూస్‌టుడే, బొబ్బిలి

ఆకట్టుకున్న రచనలు





రాజాం పట్టణంలోని వరలక్ష్మి సెయింట్ ఆన్స్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాలపై బాలలు పదునైన ఆలోచనలతో చేసిన రచనలు ఆకట్టుకున్నాయి. వై.సుషిన్య (9వ తరగతి), ఎస్.సిరివల్లి (10వ తరగతి), వి.గీతాంజలి (8వ తరగతి) విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపల్ సిస్టర్ జూలియట్, ఉపాధ్యాయులు డి.రామలక్ష్మి, కనకదుర్గ కమల, ఎస్.సురేష్ విద్యార్థులను అభినందించి బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. –న్యూస్‌టుడే, రాజాం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? బొండపల్లి మండలంలో స్వచ్ఛత కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రిక్షాలు మూలకు చేరాయి. మరమ్మతులు చేయాలి. - స్థానికులు

● పరిశీలించి, మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - ఎ.రఘుపతిరావు, ఈవోపీఆర్డీ, బొండపల్లి – న్యూస్‌టుడే, బొండపల్లి

? రామభద్రపురం మండలంలోని ఇట్లమామిడిపల్లి, రొంపల్లి, దుప్పలపూడి రహదారులను ఆనుకొని తుప్పలు పెరగడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

● తుప్పలను తొలగించడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. - త్రినాధరావు, ఉపాధి ఏపీవో – న్యూస్‌టుడే, రామభద్రపురం

? గంట్యాడ మండలంలోని కొండతామరాపల్లి పాఠశాల రహదారి కల్వర్టుపై వేసిన మట్టి దిమ్మలతో ప్రయాణికులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. - స్థానికులు, కొండతామరాపల్లి

● ప్రమాదకరంగా దర్శనమిస్తున్న మట్టి దిమ్మలను తొలగిస్తాం. - కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ, గంట్యాడ – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ఉద్యోగ ధీమా

ఉచిత శిక్షణ..

● యువకులకు ప్రత్యేక తర్ఫీదు

● సాధన చేస్తున్న అభ్యర్థులు



మైదానంలో మెలకువలు నేర్పుతూ..

ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్ల ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తామని ఇటీవల హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. ఆసక్తితో ఉన్న అభ్యర్థులకు బొబ్బిలిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు పట్టణానికి చెందిన రావు శ్రీనివాసరావు. రోజుకు 50 నుంచి 70 మంది హాజరై ఉదయం, సాయంత్రం బొబ్బిలి క్రీడా మైదానంలో ఆయన వద్ద తర్ఫీదు పొందుతున్నారు. ముఖ్యంగా 5 కి.మీ. పరుగుపందెం, హై జంప్, లాంగ్ జంప్ వంటి అంశాల్లో సాధన చేస్తున్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

30 ఏళ్లుగా..

ఎస్ఎస్‌సీ, నేవీ, ఎయిర్ ఫోర్సుల్లో ఉద్యోగాల సాధనకు ఈయన శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ తర్ఫీదు పొందినవారిలో ఏడాదికి 100 నుంచి 120 మంది పోలీస్ కానిస్టేబుళ్లుగా, ఎస్ఐలుగా ఎంపికవుతున్నారు. ఇటీవల అగ్నివీర్ ఎంపికల్లోనూ సుమారు 20 మంది ఎంపికయ్యారు. 30 ఏళ్లుగా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తూ ఎంతోమందికి ఉద్యోగాలు వచ్చేలా దోహద పడుతున్నారు.

దృష్టి సారిస్తే మేలు



గ్రామీణ యువత కాస్త దృష్టి సారిస్తే కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యే అవకాశం ఉంది. ఇక్కడ ఉచితంగానే నేర్చుకోవచ్చు. ఉద్యోగం సాధించాక ఆయా కుటుంబాల్లో వెలుగులు చూస్తే ఆనందమనిపిస్తోంది. ప్రస్తుతం జీడీ కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్ష ఉంది. దీనికి తర్ఫీదు ఇస్తున్నాం. – రావు శ్రీనివాసరావు, జాతీయ క్రీడాకారుడు

ఉద్యోగం సాధిస్తా..



కానిస్టేబుల్ పరీక్ష కోసం రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నాను. పరుగుతో పాటు హై, లాంగ్ జంప్ వంటి వాటిపై సరైన శిక్షణ ఇస్తున్నారు. దీంతో గట్టి నమ్మకం ఏర్పడింది. థియరీ పరీక్షలో విజయవంతంగా నెగ్గాం. మంచి మార్కులు వచ్చాయి. దేహదారుఢ్య పరీక్షలో కూడా అదే విధంగా ముందుంటాం. – కె.తులసీరావు

దేహదారుఢ్య పరీక్షకు..



రెండేళ్ల కిందట కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలో 85 మార్కులు సాధించాను. దేహదారుఢ్య పరీక్ష ఉంది. ఇటీవల భర్తీ చేస్తామని హోంమంత్రి ప్రకటించారు. వీటికి సంబంధించిన మెలకువలు మైదానంలో శ్రీనివాసరావు వద్ద నేర్చుకుంటున్నాను. ఉద్యోగం ఈ దఫా సాధిస్తానన్న గట్టి నమ్మకం ఉంది. – రామకృష్ణ

దూరప్రాంతాల నుంచి..



బొబ్బిలి పట్టణం, మండలం నుంచే కాకుండా పలు మండలాల అభ్యర్థులు బొబ్బిలి మైదానానికి వచ్చి శిక్షణ తీసుకుంటున్నారు. వారితో బృంద చర్చలు జరిపి వివిధ అంశాలపై చర్చిస్తున్నాం. రెండేళ్లుగా మైదానంలో శిక్షణ తీసుకుంటున్నాం. దేహదారుఢ్య పరీక్షను సమర్థంగా ఎదుర్కొంటానన్న ధీమా ఉంది. – పి.రవితేజ

మండలానికి 100 ప్రాథమిక వ్యాపార కేంద్రాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ నుంచి ప్రతి మండలానికి 100 ప్రాథమిక వ్యాపార కేంద్రాలను స్వీప్ పథకం ద్వారా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు యు.వీరేశ్వర్, డి.తేజేశ్వరరావు తెలిపారు. గురువారం గజపతినగరం మండలంలో ఇప్పటికే నడుస్తున్న ప్రాథమిక వ్యాపార కేంద్రాలను పరిశీలించారు. వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గజపతినగరం క్లస్టరు పరిధిలోని గజపతినగరం, బాడంగి, రామభద్రపురం, మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీ, వీవోఏలకు అవగాహన కల్పించారు. చిరు వ్యాపారాలకు రుణసదుపాయం కల్పించి మహిళలను మరింత ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గజపతినగరం స్వీప్ ఏపీఎం ఇందిరమ్మ, ఏపీఎం లోకేటి సత్యనారాయణ, ఎస్వీపీ ఏపీఎం దేవర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టైలరింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెర్ప్ అధికారుల బృందం

పూర్వ విద్యార్థుల సమావేశం

సంతకవిటి, న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లసీతారాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1989-90 ఏడాదిలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. 2025 జనవరి 18న నాటికి 30 ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులతో కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు కేబీవీ సురేష్‌కుమార్, చంద్రబాబునాయుడు, సింహాచలం తెలిపారు.

అపరిశుభ్రత తొలగించారు



గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నీలావతిలో సామాజిక మరుగుదొడ్ల చుట్టూ పేరుకుపోయిన అపరిశుభ్రతతో పాటు చెత్తాచెదారాలను అధికారులు తొలగించారు. దీనిపై ఆగస్టు 4న 'ఈనాడు' మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురించడంతో స్పందించిన అధికారులు అపరిశుభ్రతను తొలగించడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తంచేశారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు

స్పందనకు వందనం

బొండపల్లి, న్యూస్‌టుడే: బొండపల్లి మండల కేంద్రంలో అపరిశుభ్రత తీవ్రంగా ఉందని రెండు రోజులు క్రితం 'ఈనాడు'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ రఘుపతిరావు పారిశుద్ధ్య కార్మికులను తీసుకువెళ్లి పరిశుభ్రత పనులు చేపట్టారు. సర్పంచి బి.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జె.ఎన్.రాజు, ఇంజినీర్ సహాయకురాలు జె.చిన్నమ్మలు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలు రుచిగా ఉండాలి

తెర్లాం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఆహార పదార్థాలు రుచిగా ఉండేలా వంట నిర్వాహకులు చూసుకోవాలని ఎంఈవో జె.త్రినాధరావు అన్నారు. గురువారం మండలంలోని రంగప్పవలస పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తాగునీరు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల పాఠ్యాంశాలతో పాటు వర్క్‌బుక్స్, నోటు పుస్తకాలు పరిశీలించి తప్పులు లేకుండా సరిచేయాలని సూచించారు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమాత్రం అనుమానమున్నా అధికారులకు, కార్యదర్శికి తెలియజేయాలని స్పష్టం చేశారు.



ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

ఆందోళనతో మెట్టు దిగిన ఎక్సైజ్ శాఖ



దుకాణాన్ని తరలిస్తామని కౌన్సిలర్ల సమక్షంలో భరోసా ఇచ్చిన సీఐ

బొబ్బిలి, న్యూస్‌టుడే: మేదరబంద కూడలిలో మద్యం దుకాణం వద్దంటూ 16 నుంచి మహిళలు పలు రూపాల్లో ఆందోళన చేస్తున్నారు. ఎమ్మెల్యే బేబినాయన వద్దకు వెళ్లి సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు దుకాణం వద్దకు ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు గురువారం వెళ్లి మహిళలకు భరోసా ఇచ్చారు. తాత్కాలిక అనుమతులతో దుకాణం నడుస్తోందని, వేరే చోటకు తరలించేందుకు దుకాణం వెతుకుతున్నామని చెప్పారు. అద్దెకు ఇచ్చిన యజమాని కూడా ఖాళీ చేయాలని కోరుతున్నారన్నారు. తరలింపులో ఎలాంటి జాప్యం చేయబోమని భరోసా ఇచ్చారు. స్థానిక వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే హామీ మేరకు అధికారులు తరలిస్తున్నారన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి

రాజాం, సంతకవిటి, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే పరమావధిగా తెదేపా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంతకవిటి మండలం బొద్దూరుకు చెందిన ఇనుమల అనిల్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.1,57,708, ఇటీవల విద్యుత్తు ప్రమాదంలో మృతి చెందిన రేగిడి మండలం లక్ష్మీపురానికి చెందిన గురయ్య కుటుంబానికి రూ.లక్ష అందించారు.



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

సంక్షిప్త సమాచారం

ఘనంగా ఉత్సవాలు



బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెంలో నందెమ్మ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నాగుల చవితి రోజున గౌరీశ్వరిని నిమజ్జనం చేయడానికి నిర్ణయించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: ఐటీఐలో వివిధ ట్రేడుల్లో మిగులు సీట్లకు అయిదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ భాస్కరరావు కోరారు. 26లోగా దరఖాస్తులు చేసుకోవాలని, 27న పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

శుభ్రతతో ఆరోగ్యం

చీపురుపల్లి గ్రామీణం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని భాజపా మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం అన్నారు. రామలింగాపురంలో ఆరోగ్య, సచివాలయ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

రాజాం: పోలియో మహమ్మారిని తరిమేయడంలో రోటరీ సంస్థ సేవలు నిరుపమానమని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జి.భార్గవి పేర్కొన్నారు. అంతర్జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా పొగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశంలో పాల్గొన్నారు.

వరికి తెగుళ్లు

సంతకవిటి: వరి పంటను ఆశిస్తున్న సుడిదోమ, ఆకు ఎండు తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రాజాం ఏడీఏ చంద్రరావు, విజయనగరం డీఆర్సీ ఏడీఏ భారతి, ఏవో పి.నవీన్ తెలిపారు. గుళ్లసీతారాంపురంలో వరి పొలాలను పరిశీలించారు.

వ్యాధులపై సర్వే

బాడంగి (రామభద్రపురం): వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది సర్వే చేయాలని డీఐవో అచ్యుత కుమారి సూచించారు. గొల్లాదిలో చిన్నారికి తట్టు లక్షణాలు కనిపించడంతో వాడాడ వైద్యాధికారి ఆదిత్యతో కలిసి గ్రామాన్ని సందర్శించారు.

నేటి నుంచి పశుగణన

గంట్యాడ: గ్రామాల్లో 21వ జాతీయ పశుగణన సర్వే శుక్రవారం నుంచి ప్రారంభం కానుందని ప్రాంతీయ పశువైద్య ఏడీ రెడ్డి కృష్ణ తెలిపారు. పదేళ్లకోసారి ఈ సర్వే నిర్వహిస్తారన్నారు.

విద్యార్థుల ప్రతిభ

తెర్లాం: మండలంలోని వెలగవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం జేడీ రాజు తెలిపారు. ధ్రువపత్రాలు, ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గరివిడి, న్యూస్‌టుడే: రణస్థలం ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం గరివిడి మండలం కోనూరు 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో శివరాం, పర్ల, దుమ్మేద, దేవాడ, నడిపేనపేట, అర్తమూరు, తోండ్రంగి, దువ్వాం, శేరీపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ పి.త్రినాధరావు తెలిపారు.

గుర్ల, న్యూస్‌టుడే: మండలంలోని నాగళ్లవలస ఉప కేంద్రం పరిధిలో నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ త్రినాధరావు తెలిపారు. దీని వల్ల నాగళ్లవలస, జమ్ము, జమ్ముపేట, రాగోలు, సదానందపురం, గొలగాం, గరిడ, చిననాగళ్లవలస, తోండ్రంగి, శేషపుపేట, వల్లాపురం, దమరసింగి గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు గజపతినగరం, పురిటిపెంట, ఎం.వెంకటాపురం, మరుపల్లి, ఎం.గుమడాం, గంగచోళ్లపెంట, కొనిశ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, మధుపాడ గ్రామాల సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఏ శివకుమార్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

నియోజకవర్గ సమావేశంలో మంత్రి శ్రీనివాసరావు

గజపతినగరం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గజపతినగరంలోని ఓ ప్రైవేటు వేడుక మందిరంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రాథమిక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో లక్షకు పైగా సభ్యత్వాలు చేసి, పార్టీకి అండగా నిలవాలన్నారు. గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో ప్రతి గ్రామంలో రెండు వర్గాలుగా కార్యకర్తలు ఉండడం సరికాదన్నారు. నియోజకవర్గానికి ఇంటింటి కుళాయి పథకానికి శాశ్వత ప్రాజెక్టుల నుంచి నీరు అందేలా రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎన్నికల ముందు గుర్తించిన రహదారులకు రూ.15 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం దీపావళి నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. మంత్రిగా నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నాననే ఆందోళన వద్దని, తండ్రి కొండలరావు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వారితో చెప్పలేనప్పుడు వాట్సాప్‌లో సమాచారాన్ని నేరుగా తెలియజేయాలని సూచించారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీలు గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యులు మక్కువ శ్రీధర్, బండారు బాలాజీ, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండపల్లి


విద్యుత్తు షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం

వంగర, న్యూస్‌టుడే: మండలంలోని కొప్పరవలసకు చెందిన సాదెం కోటేశ్వరరావు ఇంట్లో గురువారం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా తీగలు, పంకాలు కాలిపోయాయి. మూడు రోజుల కిందట రుషింగిలో యలకల శ్రీనివాసరావుకు చెందిన మోటారు కూడా కాలిపోయింది. తరచూ విద్యుత్తు, అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అధిక సామర్థ్యమున్న నియంత్రికలు ఏర్పాటుచేసి లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.6.41 కోట్లతో 120 పనులు

మెంటాడ, న్యూస్‌టుడే: మెంటాడ మండల సర్వసభ్య సమావేశంలో ఉపాధి పథకం కింద రూ.6.41 కోట్లతో 120 పనులు మంజూరయ్యాయని ఇంజినీరింగ్ అధికారి గౌతమ్ తెలిపారు. అంతకుముందు ఉప ఎంపీపీ ఈశ్వరరావు, కూనేరు సర్పంచి శ్రీరాములుతో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ.. తమకు సమాచారం అందించకుండా గ్రామ సంఘాన్ని ఎలా ఎంపిక చేశారని ఏపీఎం సత్యనారాయణను నిలదీశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



వెంకటప్పడు, ఉపాధ్యాయుడు

రామభద్రపురం, న్యూస్‌టుడే: మండలంలోని రావివలస ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడు వెంకటప్పడు (58) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో కొండకెంగువ వద్ద గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. ఎంఈవో తిరుమల ప్రసాద్‌తోపాటు మండల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

పరిశ్రమల కాలుష్యంతో ఇబ్బందులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గోపాలం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లోని పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న కాలుష్యంతో ఎం.బూర్జివలస ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు గోపాలం, అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.బూర్జివలసలో గురువారం జరిగిన పార్టీ శాఖ మహాసభలో మాట్లాడుతూ 10 హెచ్‌పీ మోటారుతో భూగర్భజలాలు తోడేయడంతో బోర్లకు నీరు అందడం లేదని తెలిపారు. నాయకులు కోలా శంకరరావు, రమణమ్మ పాల్గొన్నారు.

పోలియో రహిత ప్రపంచమే లక్ష్యం

బొబ్బిలి, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజమే తమ లక్ష్యమని రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు అన్నారు. గురువారం ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ చేపట్టారు. సామాజిక ఆరోగ్యకేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీని బొబ్బిలి క్లబ్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసన్, సీహెచ్‌సీ ఇన్‌ఛార్జి జి.శశిభూషణరావు, వైద్యురాలు సంతోషి ప్రారంభించారు. రోటరీ ప్రతినిధులు శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, వెంకటేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నట్టల నివారణ మందుతో మేలు




మందు వేస్తున్న ఏడీ శారద

చీపురుపల్లి, రామభద్రాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ ముందును గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి ప్రాంతీయ పశువుల ఆసుపత్రి ఏడీ ఆర్.శారద సూచించారు. గురువారం చీపురుపల్లిలోని జి.అగ్రహారంలో 650 గొర్రెలు, 150 మేకలకు నట్టల నివారణ మందు వేశారు. ● రామభద్రపురం పంచాయతీలో గురువారం గొర్రెలకు నట్టల నివారణ మందులను మండల పశువైద్యాధికారిణి హిరణ్య ఆధ్వర్యంలో సిబ్బంది వేశారు. 25వేల గొర్రెలకు, మేకలకు మందులు వేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

తెర్లాం, న్యూస్‌టుడే: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్వేయరు సాయికుమార్, రీసర్వే ఆర్ఐ రవికిరణ్ అన్నారు. తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ ఆదేశాలతో గురువారం మండలంలోని పెరుమాళి సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వే తప్పులు పరిష్కరించాలని జగ్గరాజు, శివాజీరాజు, అప్పలనాయుడు, జగన్నాథం తదితర రైతులు వినతి పత్రాలు అందజేశారు. వీఆర్వోలు శ్రీనివాసరావు, నాగరాజుతో పాటు సిబ్బంది ఉన్నారు.



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట



సృజనకు పదును



విజయనగరంలోని నేషనల్ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బి.రోహిత తనీష(తొమ్మిదో తరగతి), బి.జోనాథన్ నిహార్(తొమ్మిదో తరగతి), ఆర్.ఎస్.ఎస్. నందిని(తొమ్మిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాల సంచాలకుడు బొద్దు రామారావు, ఇన్‌ఛార్జి ఎం.దీపక్, ఉపాధ్యాయులు పి.ఆదినారాయణ, బి.ఉషారాణి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

హోం మంత్రికి సత్కారం

పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: జిల్లా పర్యటనలో భాగంగా భోగాపురం మండలానికి వచ్చిన రాష్ట్ర హోంశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనితకు రాజాపులోవ వద్ద రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తెదేపా జిల్లా మహిళ అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, రవిశేఖర్ దంపతులు శ్రేణులతో కలిసి వెళ్లి గురువారం ఘన స్వాగతం పలికారు. గజమాల, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం మొక్క బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు, ఫణీరాజు, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాజాపులోవ వద్ద హోంమంత్రి అనితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, రవిశేఖర్ తదితరులు

కదలని సమస్యలు.. తప్పని అవస్థలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పాలిక పరిధిలోని పలు కాలనీలు, శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కరవవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నిధులు మంజూరు కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. తాగునీరు అందకపోవడం, రోడ్లు, కాలువలు లేకపోవడం, మురుగు పేరుకుపోవడం తదితర సమస్యలు వెంటాడుతున్నాయి.



అలకనందా కాలనీలో గురువారం సాయంత్రం రంగుమారిన నీరు సరఫరా

రంగుమారిన నీరే దిక్కు..

రంగుమారిన నీరు వస్తోందని పలుచోట్ల నుంచి ఫిర్యాదులున్నాయి. గురువారం సాయంత్రం అలకనందాకాలనీలో ఈ పరిస్థితి కనిపించింది. వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ వర్క్‌షాప్, బూర్లివారి కల్లాల దారి, సంతోష్‌నగర్‌లోనూ బురద నీరు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

వెలుగులేవీ?

ఎన్నికల ముందు నుంచి సంతోష్‌నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. ఆర్టీసీ శిక్షణ కేంద్రం దారి పొడవునా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్రియానగర్‌లో రహదారులు, కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గణేష్‌నగర్, యాత వీధిలో సామాజిక మరుగుదొడ్లు మరమ్మతుకు గురయ్యాయి. కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉంది. ఈ వీధుల్లోనూ కాలువలు లేవు. యాతవీధి, పెద్దవీధి, రొంగలి వీధిలో డ్రైనేజీల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. గాంధీనగర్‌లోని పార్కును అభివృద్ధి చేయాల్సి ఉంది. గాంధీనగర్ నుంచి ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు వరకు ఆక్రమణలు కనిపిస్తున్నాయి.

అభివృద్ధికి నోచుకోని ఉద్యానాలు..

టీసీఎల్ లేఅవుట్, శ్రావణినగర్, కృష్ణరాజపురంలోని ఉద్యానాలు అభివృద్ధికి దూరమయ్యాయి. వాటిల్లో పనికి రాని మొక్కలు పెరగడంతో పురుగులు, పాములు సంచరిస్తున్నాయి. కృష్ణరాజపురం, శ్రీనివాసనగర్‌లో కాలువలు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు మినీ డంపింగ్‌యార్డులుగా దర్శనమిస్తున్నాయి. ఎస్వీఎన్ నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అపార్టుమెంటుల వద్ద మురుగు కదలని పరిస్థితి నెలకొంది. ఇక్కడి నుంచి రామకృష్ణానగర్ వైపు వెళ్లే దారి గుంతలమయమైంది. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం – సీబీ కాలనీ, సాయిబాబా కోవెల దారి, వివేకానందకాలనీలోనూ ఇదే దుస్థితి.

సమస్యలు పరిష్కరిస్తాం..

శుద్ధి చేసిన తాగునీరును అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ పరీక్షలు చేయిస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. ❖ విద్యుత్తు తీగలు సరిచేస్తామని, అవసరమైన చోట దీపాలు ఏర్పాటు చేస్తామని ఈఈ పి.త్రినాథరావు చెప్పారు.



యాతవీధిలో అధ్వానంగా కాలువ

నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కొత్తవలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలుర 68వ రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలు కొత్తవలసలోని భారత డిఫెన్స్ అకాడమీ ప్రాంగణంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ గురువారం వెల్లడించింది. పూర్వ 13 జిల్లాల నుంచి క్రీడాకారులు అంతర జిల్లాల స్థాయి పోటీల్లో తలపడనున్నట్లు చెప్పింది.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం - 80089 02900
విజయనగరం గ్రామీణం - 80085 74317
ఎస్.కోట - 80085 74326
భోగాపురం - 80085 74319

? బాబామెట్ట గాంధీ పార్కు వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. - స్థానికులు
❖ పరిశీలించి, బాగు చేయిస్తాం. - లక్ష్మి, ఏఈ, నగర పాలక సంస్థ
? టీసీసీ లేఅవుట్ వద్ద పార్కు అపరిశుభ్రంగా ఉంది. - స్థానికులు
❖ పరిశీలించి, శుభ్రం చేయిస్తాం.
? అంబేడ్కర్ కాలనీలో కుళాయిల నుంచి రంగుమారిన నీరు వస్తోంది. - స్థానికులు
❖ స్వచ్ఛమైన మంచినీరు అందిస్తాం. - పి.నల్లనయ్య, కమిషనరు
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం
? కొత్తవలస-విజయనగరం రహదారిలో గెడ్డ జాల కూడలి వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. - దేగల అప్పలరాజు, సీపీఐ నేత
❖ ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. త్వరలో పనులు చేపడతాం. - శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ – న్యూస్‌టుడే, కొత్తవలస
? డెంకాడలో సీసీ కాలువల్లో మురుగు పేరుకుపోయింది. - స్థానికులు
❖ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మురుగును తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - వై.భవాని, ఎంపీడీవో. – న్యూస్‌టుడే, డెంకాడ
? ఎస్.కోటలో కర్పూర కల్లాల వెళ్లే మార్గంలో వీధి దీపాలు రాత్రివేళల వెలుగుతూనే ఉన్నాయి. -స్థానికులు, ఎస్.కోట
❖ విద్యుత్తు లైన్లు కలిపినట్లు ఉన్నాయి. వెంటనే సరిచేయిస్తాం. -అనూరాధ, ఏఈవో – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

దీపాలు వెలిగాయ్

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: శ్రీనగర్‌కాలనీ, దాసన్నపేటలో వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఈఈ రాయల్‌బాబుకు తెలపగా.. సిబ్బందితో బాగుచేయించారు.

నిర్మించారు సరే.. ప్రారంభమెప్పుడో?

ఎస్.కోట మండలం మూలబొడ్డవర పంచాయతీలో అన్నదాతల సేవల కోసం రైతు సేవా కేంద్రం నిర్మించి రెండేళ్లయినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ అమ్మపాలేనికి వెళ్లే దారిలో రూ.21.8 లక్షలతో దీన్ని నిర్మించారు. ప్రస్తుతం మూలబొడ్డవరలో నిరుపయోగంగా ఉన్న పాత పంచాయతీ భవనాన్ని ఈ కేంద్రంగా మార్చినా అక్కడికి సిబ్బంది ఎవరూ వెళ్లడంలేదు. సచివాలయంలోనే నిర్వహిస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఏఈ సత్యనారాయణ వివరణ కోరగా త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, శృంగవరపుకోట



రోడ్డంతా గోతులమయం!



జిల్లాలోని భీమసింగి నుంచి కొత్తవలస రోడ్డు అంతా గోతులమయంగా అధ్వానంగా మారడంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు ఒడిశా, ఇటు విజయనగరం, రాజమండ్రి, గుంటూరుకు నిత్యం వేలాది లారీలు, బస్సులు వెళ్తుంటాయి. గతంలో ఈ మార్గంలో భీమసింగికి చెందిన బాలుడు ప్రమాదానికి గురై మృతి చెందాడు. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లూ నిర్మాణాన్ని విస్మరించింది. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ ఉదయ్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఈ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జామి

ఎట్టకేలకు స్తంభం మార్పు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలోని గాజులరేగ బీటీఆర్ కాలనీలో ప్రమాదకరంగా ఓ వైపు ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో సిమెంటు స్తంభం వేశారు. ఇంతవరకు ఇనుప స్తంభం ఉండేది. దీనిపై 'ఈనాడు'లో 'ఒరిగిన స్తంభం.. పొంచి ఉన్న ముప్పు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు స్పందించి, చర్యలు తీసుకున్నారు.



మద్యం దుకాణం మార్చాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తమ గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాన్ని వేరొక చోటుకు మార్పు చేయాలని కుమిలి గ్రామస్థులు కోరారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దల్లి ముత్యాలరెడ్డి, డి.రామచంద్రరావు ఆధ్వర్యంలో వారంతా గురువారం ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ అంబేడ్కర్‌లను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, గత ప్రభుత్వ హయాం నుంచి ఉన్న ఈ దుకాణాన్ని తొలగించాలని ఎన్నిసార్లు కోరినా స్పందించడం లేదని వాపోయారు.



వినతిపత్రాలతో కుమిలి గ్రామస్థులు

నిబంధనలపై పునరాలోచించాలి



వినతిపత్రం అందిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ నాయుడు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వినితిపత్రం అందజేశారు. వైద్య రంగానికి రక్షణగా నిలిచేలా 2008లో తీసుకువచ్చిన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌ల విషయంలో అగ్నిమాపక శాఖ నిబంధనల్లో కొన్నింటిని సవరించి తగు అనుమతులు జారీ చేయాలని విన్నవించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ నాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్రగిరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ❖ మంత్రిని ఎమ్మెల్యే లోకం మాధవి, విక్రమ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్వి కలిశారు.

సమస్యలపై వినతుల వెల్లువ



బానాదిలో గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

డెంకాడ, కొత్తవలస, జామి, వేపాడ, ఎల్.కోట, న్యూస్‌టుడే: గ్రామాల్లో అధికారులు గురువారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమాల్లో సమస్యలపై వినతులు వెల్లువలా వచ్చాయి. డెంకాడ మండలంలోని గునుపూరుపేటలో ఎంపీడీవో వై.భవాని ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు పర్యటించి గ్రామసందర్శన నిర్వహించారు. అనంతరం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో రెవెన్యూపరమైన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆనందరాజు చెరువును పలువురు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నా చర్యలు లేవని మాజీ సర్పంచి పైల ఈశ్వరరావు, నాయకులు పైల రామారావు ఆరోపిస్తూ.. అధికారులను నిలదీశారు. తారకరామతీర్థసాగర్ కుడికాలువ ఎలైన్‌మెంట్ మార్పుతో గ్రామానికి నష్టం ఏర్పడుతోందన్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో తెలిపారు. ❖ కొత్తవలస మండలం దేవాడ రెవెన్యూలో నిర్వహించిన గ్రామసభకు రైతుల నుంచి 83 దరఖాస్తులు వచ్చాయని రీసర్వే ఉప తహసీల్దారు జె.కె.అప్పారావు చెప్పారు. ఇందులో మ్యూటేషన్లు, జాయింటు ఎల్‌పీఎంలకు సంబంధించిన సమస్యలే ఉన్నాయని తెలిపారు. ❖ జామి మండలం పావాడ గ్రామంలో సర్పంచి జాగరపు జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏవో నరసింహం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈవోపీఆర్డీ ఉమ పాల్గొన్నారు. ❖ వేపాడ మండలం బానాదిలో నిర్వహించిన గ్రామసభలో 54 వినతులు వచ్చాయని తహసీల్దారు రాములమ్మ తెలిపారు. సర్పంచి యశోద, ఎంపీటీసీ సభ్యురాలు తులసి, వీఆర్వో పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళా

ఎస్.కోట, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటరు(జేకేసీ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రిన్సిపల్ సీహెచ్ కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ మేళాకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 300 మంది నిరుద్యోగులు హాజరయ్యారని జేకేసీ కోఆర్డినేటర్ జి.ఈరన్న తెలిపారు. మెట్రో కంపెనీలో 31 మంది, జస్ట్ డయల్ 14, గ్రాండ్ ఫార్మా 11, యంగ్ ఇండియా కంపెనీకి 13 మంది ఇతర కంపెనీలతో కలిపి మొత్తం 93 మంది ఎంపికయ్యారన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి భాస్కరరావు మాట్లాడుతూ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. సీడాప్ కోఆర్డినేటర్ కిశోర్, యంగ్ ప్రొఫెషనల్ యశ్వంత్, వైస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు పాల్గొన్నారు.



ముఖాముఖి నిర్వహిస్తున్న హెచ్‌ఆర్

సీతారాముల కల్యాణం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: రామనారాయణంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం, పూజలు జరిగాయి.



రామయ్యకు ప్రత్యేక పూజలు



నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పునర్వసు పట్టాభిషేకం, ప్రాతఃకాలార్చన, బాలభోగం అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులకు నిత్య కల్యాణ పూజలు జరిపించారు. గత 27 రోజులుగా శ్రీమద్రామాయణ పారాయణం నిర్వహించారు. ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం అనంతరం పట్టాభిషేకం చేపట్టారు. స్వామికి విశేషంగా పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

వైద్యురాలు వరలక్ష్మికి గ్లోబల్ విమెన్ పురస్కారం



అవార్డు అందుకుంటున్న డాక్టరు వరలక్ష్మి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: సామాజిక, వైద్య సేవలకు గానూ పట్టణానికి చెందిన గైనకాలజిస్ట్ పొట్నూరు వరలక్ష్మి న్యూదిల్లీకి చెందిన గ్లోబల్ విమెన్ ఇన్‌స్పిరేషన్ సంస్థ నుంచి గ్లోబల్ విమెన్ పురస్కారం అందుకున్నారు. ఈనెల 17న రాజధానిలో జరిగిన 'ఇన్‌స్పైర్ విమెన్ సమ్మిట్-2024'లో 'మహిళా సాధికారత, చైతన్యం' పై చర్చా గోష్ఠిలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆ కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. ఈమె

పాఠశాలల పరిశీలన

వేపాడ, ఎల్.కోట: వేపాడకు సమీపంలోని కస్తూర్బా పాఠశాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పైడిరాజు గురువారం పరిశీలించారు. భవన నిర్మాణాలు నిలిచిపోవడంపై ఆరా తీశారు. చిన్నారులకు మధ్యాహ్న భోజనాలను వడ్డించారు. ❖ ఎల్.కోట ఆదర్శ పాఠశాలలో ఓలేటి ప్రకాశరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం తనిఖీ చేశారు. బోధన, నిధుల వ్యయంపై ఆరా తీశారు. నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామని ప్రకాశరావు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బాణసంచా స్వాధీనం

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని గాజులరేగ సమీపంలోని ఓ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.6 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకుని, నిర్వాహకులపై కేసు నమోదు చేశామని రెండో పట్టణ ఎస్ఐ బి.మురళీ తెలిపారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ఓ కళాశాలకు చెందిన విద్యార్థుల మధ్య గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ పంచాయితీ గ్రామీణ స్టేషన్‌కు చేరింది. ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వెనక్కి పంపించామని ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య సూచించారు. తన కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల ఆర్పీలు, సీవోలతో ఆయన సమావేశమయ్యారు.

భోజన పథక నిర్వాహకుల ధర్నా

ఎల్.కోట: మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ధరలకు అనుగుణంగా నెలకు రూ.10 వేలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ నేతలు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వాహకులు డిమాండు చేశారు. ఎమ్మార్సీ వద్ద ధర్నా చేశారు. ఎంఈవోకు వినతి పత్రం అందించారు.

మాలధారులకు నిత్యాన్నదానం

కొత్తవలస: ఉత్తరాపల్లి అయ్యప్పస్వామి పీఠం వద్ద అయ్యప్ప, ఇతర మాలధారులకు మధ్యాహ్నం నిత్య అన్నదానం చేస్తున్నట్లు గ్రామానికి చెందిన సింగంపల్లి గణేష్ తెలిపారు. ఈనెల 18న ప్రారంభించామని, నవంబరు 24 వరకు కొనసాగుతుందన్నారు. కొత్తవలస, ఎల్.కోట మండలాలకు చెందిన 150 మంది మాలధారులు ప్రస్తుతం హాజరవుతున్నారన్నారు.

హుండీ ఆదాయం రూ.28.08 లక్షలు



నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానం హుండీ ఆదాయం రూ.28,08,291 వచ్చినట్లు ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. ఐదు నెలలకు సంబంధించి ఉదయం 9 గంటలకు స్వామివారి ధర్మ హుండీలను తెరిచి లెక్కించామని ఆయన చెప్పారు. పైడితల్లి ఆలయ ఈవో ప్రసాద్ పర్యవేక్షించారు.

ఉద్యోగులు సమయపాలన పాటించండి

జరజాపుపేట (నెల్లిమర్ల): వార్డు సచివాలయం ఉద్యోగులంతా తప్పనిసరిగా సమయపాలన పాటించాలని కమిషనరు అప్పలరాజు సూచించారు. గురువారం నెల్లిమర్లలో 2వ వార్డు సచివాలయం ఆకస్మికంగా తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వేపాడ: ఉప కేంద్రం నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండల కేంద్రంతో పాటు వల్లంపూడిలో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ జి.సూరిబాబు తెలిపారు.

బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలి

ఎస్.కోట: ఎస్.కోటలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలని జిల్లా గి.వి.సం. నాయకులు డిమాండ్ చేశారు. వసతిగృహాలను సందర్శించిన జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ బాలికలు విజయనగరం వెళ్లాల్సి వస్తోందన్నారు.

జూదరుల అరెస్టు

ఎల్.కోట: కొట్యాడ గ్రామ శివారులోని మామిడితోటలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,110 నగదు స్వాధీనపరచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు జిల్లా విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని వెంపడాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.లచ్చన్న తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న పార్వతీపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన అండర్-14 విభాగం హైజంప్‌లో వి.కళ్యాణి, 200 మీటర్ల పరుగు పందెంలో పి.లావణ్య, అండర్-17 రన్నింగ్ విభాగంలో కె.యోగిత, పి.నీరజ, పి.ఎల్లంనాయుడు, వి.చక్రవర్తి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14కి ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3, 4 తేదీల్లో ఏలూరులో, అండర్-17కి ఎంపికైన క్రీడాకారులు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

ఎంవీజీఆర్ కళాశాలలో ట్రయల్ పోటీలు



తైక్వాండో జట్టుతో కళాశాల ప్రిన్సిపల్, నిర్వాహకులు

డెంకాడ, న్యూస్‌టుడే: చింతలవలస వద్ద ఉన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విజయనగరం జేఎన్‌టీయూ గురజాడ ఆధ్వర్యంలో తైక్వాండో జట్టు ఎంపిక, ట్రయల్స్ గురువారం జరిగాయి. దీన్ని యూనివర్సిటీ పరిశీలకుడు, రఘు ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ జి.సి.ఎన్.రాజు, తైక్వాండో అసోసియేషన్ ఏపీ ప్రధాన కార్యదర్శి చి.వేణుగోపాలరావు, అసోసియేషన్ విశాఖ సభ్యుడు వి.ఎన్.డి.ప్రవీణ్, ప్రిన్సిపల్ ఆర్.రమేష్, స్టూడెంట్స్ యాక్టివిటీస్ కోఆర్డినేటర్ డి.రమాదేవి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జేఎన్‌టీయూ గురజాడ తరఫున ఒక బలమైన జట్టు నిర్మాణం, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి ఎంపికలు దోహదపడతాయన్నారు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.గోపీచంద్, పీడీ రఘు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

ఎస్.కోట, జామి, వేపాడ, న్యూస్‌టుడే: ఎస్.కోటలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో బాల్ బ్యాడ్మింటన్ అండర్-14, 17 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. 130 మంది క్రీడాకారులు హాజరయ్యారని పీడీ జి.లక్ష్మణరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు జి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. 40 మందిని ఎంపిక చేశారు. ❖ జామి ఉన్నతపాఠశాలకు చెందిన పల్ల జగన్‌మోహన్, బొట్ట నిఖిల్, లక్ష్మీపురానికి చెందిన జి.గోపాలకృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీలు చంద్రశేఖర్, ఎర్నమ్మ తెలిపారు. ❖ వేపాడ మండలం బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని సింగంపల్లి హేమశ్రీ వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైందని ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు తెలిపారు.



ఎంపికైన బాలికల జట్టుతో ఉపాధ్యాయులు